ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 05 | జూన్ | 2024
పేజీలు 7

## రఘురాంరెడ్డికి వామపక్ష నేతల శుభాకాంక్షలు



2 లో

# లెఫ్ట్ మద్దతుతో కాంగ్రెస్ రికార్డు విజయం



-కనీస ప్రభావం చూపలేకపోయిన బిఆర్ఎస్
-ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్‌దే ఆధిక్యం
-లక్ష మార్క్ దాటిన బిజెపి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వామపక్షాల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ రికార్డు విజయం సాధించింది. ఖమ్మం పార్లమెంటు చరిత్రలో కనీవినీ ఎరుగని మెజార్టీని సాధించింది. 1952లో ఖమ్మం పార్లమెంటు ఏర్పడిన తర్వాత ఈ స్థాయి గెలుపును ఎవరు అందుకోలేదు. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఆల్ టైం రికార్డు సృష్టించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పై 467847 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని దాదాపు అన్ని నియోజక వర్గాలలో కాంగ్రెస్ ఆధిక్యత కనబర్చింది. శాసన సభ ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో

మిగతా 2లో..

## బిఆర్ఎస్ ఓటమి.. స్వయం కృతపరాధమా..?






**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు పరిధిలో బిఆర్ఎస్ ఘోర ఓటమికి ఆ పార్టీయే నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన నామ నాగేశ్వరరావు తీరు ఆ పార్టీ క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యానికి గురి చేసింది. అభ్యర్థిత్వం ప్రకటించిన చాలా రోజుల పాటు నియోజక వర్గానికి రాకపోవడం, కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయంలో తలమునకలవుతున్న బిఆర్ఎస్ ప్రచారాన్ని నిర్వహించకపోవడం ఆ పార్టీ కార్యకర్తల్లో గందరగోళానికి, నిరాశకు దారి తీసింది. నామినేషన్ ప్రక్రియ తర్వాత కూడా నియోజక వర్గ ఇంచార్జిలకు ఆర్థిక సహకారం అందించక పోవడంతో చాలా మంది మొక్కుబడి ప్రచారానికే పరిమితమయ్యారు. చేతి నుంచి ఖర్చు పెట్టుకుని ప్రచారం చేసే స్థాయిలో తాము లేమంటూ పలువురు బిఆర్ఎస్ నేతలు బహిరంగంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ డబ్బుల పంపిణీ చేసినా ఖమ్మం, కొత్తగూడెం నియోజక వర్గాలలో బిఆర్ఎస్ కనీసం ఆ దిశగా ఆలోచన

మిగతా 2లో..

## రెండు పాయలుగా చీలిన తెలంగాణ ఓటర్లు





-ఉత్తరం బిజెపికి, దక్షిణం కాంగ్రెస్‌కు
-ఉత్తర, దక్షిణాలలో బిఆర్ఎస్‌కు మొండి చేయి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఓటర్లలో ప్రాంతీయ వైవిద్యం కనిపించింది. తెలంగాణ ఓటర్లు రెండు పాయలుగా చీలి రెండు పార్టీలకు మద్దతుగా నిలిచారు. ఉత్తర తెలంగాణ బిజెపికి దన్నుగా నిలిస్తే దక్షిణ తెలంగాణ కాంగ్రెస్‌కు అండగా నిలిచింది. దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో రికార్డు మెజార్టీలతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. వరంగల్, నల్గొండ, మహబూబ్‌బాద్, ఖమ్మం, భువనగిరి, నాగర్ కర్నూల్, జహీరాబాద్ లో కాంగ్రెస్ అభ్యర్థులు రికార్డు మెజార్టీ సాధించారు. నల్గొండలో కాంగ్రెస్ అభ్యర్థి కుందురు రఘువీర్ రెడ్డి ఐదు లక్షల పైచిలుకు మెజార్టీ సాధించి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచారు. ఖమ్మంలో సైతం దశాబ్దాల రికార్డు బద్దలైంది. ఇప్పటి వరకు 17 సార్లు జరిగిన

మిగతా 2లో..

# లెఫ్ట్ మద్దతుతో కాంగ్రెస్ రికార్డు విజయం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ అత్యధిక మెజార్టీ సాధించింది. ఆది నుంచి కాంగ్రెస్ గెలుపును ఊహించిదే అయినా ఈ స్థాయి మెజార్టీని మాత్రం ఊహించ లేదు. బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ప్రచార లోపం కాంగ్రెస్‌కు వామపక్షాలు తోడవడం ఈ నియోజక వర్గ పరిధిలో ముగ్గురు మంత్రులు ఉండడం కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజక వర్గాలలో ఆరు చోట్ల కాంగ్రెస్ శాసన సభ్యులు ఒక చోట సిపిఐ శాసన సభ్యులు ఉండడం కాంగ్రెస్ అభ్యర్థికి కలిసొచ్చింది. గ్రామాల్లో పోల్ మేనేజ్‌మెంట్‌లో బిఆర్ఎస్ వెనకబడింది. మొత్తం పార్లమెంటు పరిధిలో 1631039 ఓట్లకు గాను 1241135 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు 299082 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి 766929 ఓట్లు సాధించారు. బిజెపి పక్షాన పోటీ చేసిన తాండ్ర వినోద్‌రావు 118636 ఓట్లు సాధించారు. ఖమ్మం చరిత్రలో 2019లో జరిగిన ఎన్నికల్లో నామ నాగేశ్వరరావు సాధించిన 161162 ఓట్ల మెజార్టీని రఘురాంరెడ్డి అధికమించి కొత్త చరిత్ర లిఖించారు.

**పోస్టల్ బ్యాలెట్లు...**

పోస్టల్ బ్యాలెట్లలోను కాంగ్రెస్ పూర్తి అధిక్యతను కొనసాగించింది. మొత్తం 11151 పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ పార్టీకి 7326 ఓట్లు రాగా రెండవ స్థానంలో బిజెపి అభ్యర్థి నిలిచి చర్చకు దారి తీశారు. బిజెపికి 1561 ఓట్లు రాగా బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు 1490 ఓట్లు వచ్చాయి. మిగిలిన ఓట్లు ఇండిపెండెంట్ అభ్యర్థులకు పోల్ కాగా నోటాకు 125 ఓట్లు పోలయ్యాయి. 150 ఓట్లు చెల్లుబాటు కాకపోవడం విస్మయం కలిగించింది. 300 ఓట్లు సరైన పద్దతిలో లేనందున తిరస్కరణకు గురయ్యాయి.

**సంబురాలలో కాంగ్రెస్, వామపక్షాలు...**

ఖమ్మం పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ పార్టీ రికార్డు విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాలలో మునిగిపోయాయి. మండలాలు, గ్రామాలలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కార్యకర్తలు విజయోత్సవ ప్రదర్శనను నిర్వహించారు. కాంగ్రెస్ మంత్రులు, శాసన సభ్యులు విజయోత్సవాలలో పాల్గొన్నారు.

**గెలుపు పత్రం అందుకున్న రఘురాంరెడ్డి...**

ఖమ్మం పార్లమెంటు నుంచి 18వ పార్లమెంటుకు ఎన్నికైన రఘురాంరెడ్డి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ నుంచి గెలుపు పత్రం అందుకున్నారు. రఘురాంరెడ్డి వెంట రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లాకు చెందిన శాసన సభ్యులు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, నాయకులు మువ్వా విజయ్ బాబు, రాయల నాగేశ్వరరావు ఉన్నారు.

## రఘురాంరెడ్డికి
# వామపక్ష నేతల శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి వామపక్ష నేతలు శుభాకాంక్షలు తెలిపారు. వామపక్షాల మద్దతుతో విజయం సాధించిన రఘురాంరెడ్డి గెలుపు పత్రం అందుకున్న వెంటనే వామపక్ష నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు వై. విక్రం, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మిక్కిలినేని నరేంద్ర తదితరులు ఉన్నారు. ఖమ్మంజిల్లా అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.

# బిఆర్ఎస్ ఓటమి.. స్వయం కృతపరాధమా..?

(మొదటిపేజీ తరువాయి)

చేయకపోవడం మిగిలిన నియోజక వర్గాలలో చేసినా పూర్తి స్థాయిలో చేయకపోవడం బిఆర్ఎస్‌కు ఈ ఫలితం వచ్చేందుకు కారణమయ్యాయి. నామ నాగేశ్వరరావు వ్యక్తిగత ఈమేజ్ కాని కుల సమీకరణ కాని ఈ ఎన్నికల్లో కలిసి రాలేదు. ఓటర్లందరూ గంప గుత్తగా కాంగ్రెస్ వైపు మళ్లారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ నాయకత్వం పై వ్యతిరేకత వ్యక్తమైనా కాంగ్రెస్ అధికారంలో ఉండడం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బిఆర్ఎస్ వైపు ఓటర్లు చూడలేదు. కాంగ్రెస్ గెలుపు ఊహించిందే అయినా కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో రికార్డు మెజార్టీ రావడానికి మాత్రం ఖచ్చితంగా బిఆర్ఎస్ అభ్యర్థి వైఫల్యమే కారణంగా చెప్పవచ్చు. ఎంపి వద్దిరాజు రవిచంద్ర, సండ్ర వెంకట వీరయ్య లాంటి కొందరు బిఆర్ఎస్ నేతలు చురుకుగా వ్యవహరించినా ఆశించిన ఫలితం దక్కలేదు.

## రెండు పాయలుగా
# చీలిన తెలంగాణ ఓటర్లు

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటు ఎన్నికల్లో ఎవరికి ఎప్పుడు రాని మెజార్టీని కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి సాధించారు. మహబూబాబాద్ లో సైతం కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన మెజార్టీ రికార్డు మెజార్టీనే. బలరాం నాయక్ సుమారు రెండు లక్షల ఓట్లు సాధించి మహబూబ్ నగర్ పార్లమెంటు చరిత్రలో కొత్త రికార్డును నమోదు చేశారు. వరంగల్‌లో కడియం కావ్య, భువనగిరిలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి రికార్డు మెజార్టీలతో విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కాంగ్రెస్‌కు ఏకపక్షంగా ఓట్లు పడ్డాయి. ఇదే సందర్భంలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి లో బిజెపి ఏక పక్ష విజయాలను సాధించింది. ఆది నుంచి అందరి దృష్టిని ఆకర్షించిన కరీంనగర్ స్థానం నుంచి బండి సంజయ్ 2.20 లక్షల ఓట్ల పైచిలుకు మెజార్టీని సాధించి మరోసారి చర్చనీయాంశమయ్యారు. వార్తల్లో వ్యక్తిగా నిలిచే నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ సైతం లక్షకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. చేవెళ్లలో కొండా విశ్వేశ్వరరెడ్డి గెలుపొందగా మల్కాజ్‌గిరిలో బిజెపి నేత ఈటల రాజేందర్ రికార్డు విజయాన్ని నమోదు చేశారు. మెదక్ నియోజక వర్గం తొలి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ సొంత నియోజక వర్గం కావడం, బిఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత ఇక్కడ మరో పార్టీ గెలువక పోవడం సర్వేలు సైతం బిఆర్ఎస్‌కే గెలుపు అవకాశాలు ఉన్న ఏకైక నియోజక వర్గంగా పేర్కొనడంతో అందరి దృష్టి మెదక్ పై పడింది. కానీ అనూహ్యంగా మెదక్ నుంచి రఘునందన్ రావు గెలుపొందారు. మహబూబ్ నగర్ జిల్లాలో రెండు పార్లమెంటు నియోజక వర్గాలు ఉంటే మహబూబ్ నగర్ నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన డికె అరుణ గట్టి పోటీని ఎదుర్కొని స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. మహబూబ్ నగర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం కాంగ్రెస్ నాయకులు వంశీ చందర్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేయడం రాష్ట్ర వ్యాప్త చర్చకు దారి తీసింది. కాని బిజెపియే ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇదే జిల్లాలోని నాగర్ కర్నూల్ నుంచి పోటీ చేసిన ఖమ్మం వాసి మల్లు రవి విజయం సాధించారు. గతంలో ఆయన ఇక్కడి నుంచి పార్లమెంటుకు ప్రాతినిథ్యం వహించారు. సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయం సాధించినప్పటికీ ప్రజల్లో ఆయన పట్ల అంతగా సానుకూలత లేదని ఫలితాలు రుజువు చేశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ విజయం సాధించారు. ఆదిలాబాద్ ఎప్పటి లాగానే బిజెపికి దన్నుగా నిలిచింది. మొత్తంగా తెలంగాణలోని దక్షిణ ప్రాంత ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఉత్తర తెలంగాణ ఓటర్లు బిజెపికి పట్టం కట్టారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ ప్రజలు మాత్రం బిఆర్ఎస్‌కు మొండి చేయి చూపారు. దక్షిణ తెలంగాణలో రెండవ స్థానంలో నిలవగా చాలా చోట్ల మూడో స్థానానికి బిఆర్ఎస్ పడిపోయింది. బిఆర్ఎస్ ఘోర ఓటమి తర్వాత ఇప్పుడు ఆ పార్టీ భవిష్యత్తు పై సర్వత్రా చర్చ సాగుతుంది.

# హత్యా రాజకీయాల సంస్కృతి మంచిది కాదు

**ఈర్యా కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హత్యా రాజకీయాల సంస్కృతి మంచిది కాదని, ఈర్యా నాయక్ మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. రఘునాథపాలెం మండలం శివాయిగూడెం గ్రామంలో కాంగ్రెస్ గుండాల దాడిలో మరణించిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు తేజావత్ ఈర్యా నాయక్ కుటుంబాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ఈర్యా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని పువ్వాడ అందజేశారు. ప్రభుత్వాసుపత్రి మార్చురిలో ఉంచిన ఈర్యా భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈర్యా నాయక్‌ను కాంగ్రెస్ గుండాలే దాడి చేసి చంపారని ఇప్పటి వరకు మృతికి కారకులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మీరే చంపి మీరే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పై దృష్టి పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బెదిరింపులు, కక్ష సాధింపు చర్యలపై దృష్టి పెట్టారని ఆరోపించారు. ఈర్యా కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని ఆయన తెలిపారు. పరామర్శించిన వారిలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు అజ్మీర వీరునాయక్, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కూరాకుల వలరాజు, జ్యోతిరెడ్డి, రాం మోహన్, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ చెరుకూరి ప్రదీప్, మోతారపు సుధాకర్, దేవభక్తిని కిషోర్, సూర్యం, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా టిడిపి సంబురాలు







**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి విజయం సాధించడంతో ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం కార్యకర్తల సంబురాలు అంబరాన్ని అంటాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఫలితాల సరళిని చూసిన కార్యకర్తలు ఆనందోత్సవాలలో మునిగిపోయారు. ఎక్కడ చూసినా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ చంద్రబాబుకు జై కొట్టారు. ముఖ్యంగా నగరిలో రోజా, గుడివాడలో కొడాలి నాని, గన్నవరంలో వల్లభనేని వంశీ, మచిలీపట్నంలో పేర్నీ నాని కుమారుడు కిట్టు వెనకబడ్డారన్న వార్తలు సంబురానికి మరింత ఊపునిచ్చాయి. ఖమ్మంజిల్లా తెలుగుదేశం కార్యాలయంలో విజయోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.పెద్ద సంఖ్యలో గుమిగూడిన కార్యకర్తలు బాణాసంచా కాల్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబురాలు నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టిడిపి కార్యాలయంకు చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం, వైరా, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెంలో టిడిపి, జనసేన కార్యకర్తలు భారీ ర్యాలీలు నిర్వహించారు. ఖమ్మంలో టిడిపి కార్యకర్తలు ఒక విచిత్ర ప్రదర్శన నిర్వహించారు. కారుకు సీలింగ్ ఫ్యాన్ కట్టి ఈడ్చుకుంటూ బజార్ల వెంట కేరింతలు కొట్టి ఆనందోత్సవాలను వ్యక్తం చేశారు. తెలంగాణకు సరిహద్దున ఖమ్మం జిల్లా ఉండడం, వ్యాపార వాణిజ్య సంబంధాలతో పాటు తెలంగాణ ప్రజలతో పెద్ద సంఖ్యలో బంధుత్వాలు ఉండడంతో ఆంధ్రా ఫలితాలపై ఆసక్తి కనబర్చారు. ఎక్కువ మంది టిడిపి గెలవాలని వాంచించి ప్రతి గంటకు బంధువులతో ఫోన్లలో ఫలితాలపై ఆరా తీశారు. ఖమ్మం నియోజక వర్గంతో సంబంధాలు ఉన్న తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, విజయవాడ, రాజమండ్రి, రంపచోడవరం ఫలితాల పట్ల జిల్లా ప్రజలు ఎక్కువగా ఆసక్తి కనబర్చారు. ఒంగోలు జిల్లాకు చెందిన ఏలూరు సాంబశివరావు ఫలితం పై కూడా ఎక్కువ మంది ఆరా తీయడం గమనార్హం. మొత్తంగా తెలుగుదేశం పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో గెలుపు తర్వాత ఒక ఊపు వచ్చిందని చెప్పక తప్పదు.

# గెలిచినా.. ఓడినా ప్రజల మధ్యే...

### బిఆర్ఎస్ అభ్యర్థి నామ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తాను గెలిచినా ఓడినా నిత్యం నియోజక వర్గ ప్రజల మధ్యే ఉంటానని ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు కన్న తల్లి అంటే ఎంత ఇష్టమో నియోజక వర్గ ప్రజలు అంతే ఇష్టమన్నారు. గెలిస్తే పొంగిపోయేది లేదు ఓడితే కుంగేది లేదన్నారు. నిత్యం నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎంపిగా ప్రజాసేవే లక్ష్యంగా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా మచ్చలేని వ్యక్తిత్వంతో ప్రజలకు సేవలందించానని ఆయన గుర్తు చేశారు. నాకు అన్ని విధాలా అండగా ఉండి ముందుకు నడిపించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు తనకు ఓటేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తను ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగానని ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో గడప గడపకు సంక్షేమ పథకాలను అందించామని ఏదో ఒక రూపంలో ప్రతి వ్యక్తి లబ్ది పొందెలా ప్రజా రంజక పాలన అందించామని నామ నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం ఎంపిగా గెలిచినా కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

# కౌంటింగ్‌ను పరిశీలించిన కలెక్టర్లు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ కౌంటింగ్‌ను రిటర్నింగ్ అధికారి, ఖమ్మంజిల్లా కలెక్టర్ విపి గౌతమ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా పరిశీలించారు. మంగళవా రం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లో గల శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ ఓట్ల లెక్కింపు చేపట్టారు. కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్లు విపి గౌతమ్, ప్రియాంక ఆలా పరిశీలించారు. ఉదయం స్ట్రాంగ్ రూముల నుండి ఈవిఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తీసుకు వచ్చే ప్రక్రియను వారు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కౌంటింగ్‌లో ఎటువంటి లోటుపాట్లు, తప్పిదాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సిపి సునీల్ దత్ కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు.

# కార్పోరేట్ సంస్థలకు దోచిపెడుతున్న మోడీ

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** దేశంలో కార్పోరేట్ సంస్థలకు ప్రజల సొమ్ము ను దోచిపెడుతున్నాడని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు సీ.వై.పుల్లయ్య ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం కామ్రేడ్ కె.వీ.ఎల్. వర్థంతి సభ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....నేటి పాలకుల విధానాల పై క్షేత్ర స్థాయి నుంచి ఆందోళన లు చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరకు రాజీలేని పోరాటాలు సాగించాలని సూచించారు. విద్యార్థి, రైతాంగం, అన్ని వర్గాల ప్రజల ను పాలకులు మోసం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో పార్టీ పాలేరు కార్యదర్శి బందెల వెంకయ్య, తిమ్మిడి హనుమంతరావు, చిర్రా బిక్షం, వివిధ




పార్టీల నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, సన్నాయిల రమేష్, ఈదయ్య, నాగేశ్వరరావు, రామదాసు, షకీలా, వీరాలాల్, సత్యం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో టిడిపి కూటమి విజయోత్సవ ర్యాలీ

**ప్రజాపక్షం/ మధిర :** ఏపి ఎన్నికల ఫలితాల్లో అందరి ఊహగానాలను తలకిందలు చేస్తూ టిడిపి కూటమి భారీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుని అధికారం చేపట్టనున్న సందర్భంగా మంగళవారం టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు మధిరలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పట్టణం లోని ప్రధాన కూడళ్లిలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిజే సౌండ్ సిస్టమ్‌తో కోలాహాలంగా బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సిఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న నారా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండల,పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మిత్రపక్షాలు బలపర్చిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ముందుగా పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రఘురాంరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సహకరించిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, సిపిఎం రాష్ట్ర నాయకులు శీలం నర్సింహారావు, సిపిఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవి, కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి



రవికుమార్, కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కూటమి విజయోత్సవ ర్యాలీ

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** ఏపి ఎన్నికల ఫలితాల్లో టిడిపి కూటమి భారీ విజయం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అశ్వారావుపేట పట్టణంలో టిడిపి, జనసేన కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం రింగ్ రోడ్డు సెంటర్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవరగ ఇన్‌చార్జి కట్రం స్వామిదొర, జనసేన అభ్యర్థురాలు మూయబోయిన ఉమాదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డేగల రామచంద్రరావు, నార్లపాటి శ్రీను, వినోద్, గోపి, బావి తదితరులు పాల్గొన్నారు.



# ఇది ప్రజాస్వామ్య విజయం : రామనాధం

**ప్రజాపక్షం/ మధిర :** ఒక అప్రజాస్వామిక, అరాచక సైకో పాలనకు ఆంధ్ర ఓటర్లు చరమగీతం పాడారని తెలంగాణ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖమ్మం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాధం పేర్కొన్నారు. ఆంధ్రాలో పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి భారీ విజయం సొంతచేసుకున్న సందర్భంగా మండల పరిధిలోని వంగవీడు గ్రామ కార్యకర్తలు మంగళవారం డాక్టర్ రామనాధంను కలిసి భారీ విజయం పట్ల అభినందనలు తెలిపి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామనాధం మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రలో జనరంజకమైన పాలన రానున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మల్లాది హన్మంతరావు, ఐటిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్, బాధ్యులు అనుమోలు సతీష్, నాయకులు వట్టికొండ నాగేశ్వర



రావు, గుర్రం సుబ్బారావు, వంగవీడు టిడిపి గ్రామశాఖ అధ్యక్షులు పగిడిపల్లి భద్రయ్య, గుడిద వెంకటేశ్వరరావు, భూక్యా విజయ్, బాణావత్ శ్రీను, గోపి మోచర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కే జైకొట్టిన చింతకాని ప్రజలు

**ప్రజాపక్షం/ చింతకాని :** పార్లమెంట్ ఎన్నికల్లో సైతం చింతకాని మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. మండల వ్యాప్తంగా 35,580 ఓట్లు పోలవగా రామసహాయం రఘురాంరెడ్డికి 21098ఓట్లు రాగా బారాస అభ్యర్థి నామ నాగేశ్వరరావుకు కేవలం 11067 ఓట్లు పోలయ్యాయి. బిజెపి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు 1612 ఓట్లు రాగా నోటాకు 129ఓట్లు వచ్చాయి. మొత్తంగా రఘురాంరెడ్డికి 10031ఓట్ల మెజార్టీ వచ్చింది. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2400 మెజార్టీ ఎక్కువ వచ్చింది.

# అందరి కృషి వల్లే కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** అందరి కృషి వలనే ఖమ్మం ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్ధి రామసహాయం రఘురామిరెడ్డి భారీ మెజార్టీతో గెలిచారని యూత్ కాంగ్రెస్ మండల నాయకులు కడియాల నరేష్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...ఖమ్మం ఎంపీ భారీ మెజార్టీతో గెలవటం హర్షణీయం అన్నారు. ఖమ్మం చరిత లోనే 4,67,847 ఓట్లు మెజార్టీ రావటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో తీవ్రంగా కష్టపడ్డారని అన్నారు. వారందరికి పేరు, పేరు న కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు విజయానికి దోహదపడ్డాయని అన్నారు. రానున్న ఎన్నికలలో కూడ ఐక్యంగా ముందుకు సాగుతూ కాంగ్రెస్ అభ్యర్దులను గెలిపించాలని కోరారు. ఇక నుంచి ఏ ఎన్నికలు జరిగినా విజయాలు కాంగ్రెస్ పార్టీవే అన్నారు. విజయం కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యావాదాలు తెలిపారు. రఘురామిరెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.

# బీజేపీ కూటమి సంబురాలు

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** కేంద్రంలో బీజేపీ అధిక స్థానాలు సాధించిన సందర్భంగా నేలకొండపల్లి మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. బాణా సంచాలు కాలుస్తూ, స్వీట్లు పంపిణీ చేశారు. పెద్ధ ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పాగర్తి సుధాకర్ మాట్లాడారు....దేశంలో ప్రజలు మోడీ ని మరోమారు దీవించారని అన్నారు. దేశం లోని అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుంది కాబట్టే బీజేపీ కి పట్టం కట్టారని అన్నారు. గతం కంటే మరిన్ని పథకాలు మోడీ ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో బీజేపీ కూటమి విజయోత్సవ ర్యాలీ లో ఎమ్మార్పీఎస్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. జెండాలు చేత పట్టి పెద్ధ ఎత్తున నినాదాలు చేశారు. ఈ విజయోత్సవంలో ఎమ్మార్పీఎస్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

### వృథాగా పోతున్న తాగునీరు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని జగన్నాధపురం గ్రామంలో రామాలయం వద్ద మిషన్ భగీరథ పైపు లీకై గత నాలుగు రోజులుగా నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ భగీరథ ప్రవాహాన్ని ఆపేవారే లేరా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో గత నాలుగు రోజులుగా వరద నీరు ప్రవహిస్తున్న గ్రామ పంచాయితీ అధికారులు కనీసం స్పందించడం లేదని, అదే విధంగా మిషన్ భగీరథ అధికారులు సైతం స్పందించకపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్‌కు మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన రామ సహాయం రఘురాం రెడ్డికి సత్తుపల్లి నియోజకవర్గంలో రికార్డ్ స్థాయిలో ఓట్ల ఆధిక్యత లభించింది. 70,407 ఓట్ల మెజార్టీతో గత రికార్డులను బ్రేక్ చేశారు. ఇప్పటివరకు జరిగిన లోక్సభ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో ఏ అభ్యర్థికి ఇంతటి మెజార్టీ లభించలేదు. 21 రౌండ్లలో జరిగిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్ లోను రామసహాయం ఆధిక్యత ప్రదర్శించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కు లక్ష ఓట్లు లభించాయి. పార్లమెంట్ ఎన్నికల నాటికి టిఆర్ఎస్ పార్టీ సుమారు 32 వేల ఓట్లు కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 19 ఓట్లు మెజార్టీ వస్తే పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి 70,000 మెజార్టీ లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన నంబూరు రామలింగేశ్వరరావుకు సుమారు 3000 ఓట్లు మాత్రమే లభించగా పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్ రావుకు 15,416 ఓట్లు లభించాయి. బిఆర్ఎస్ పార్టీ నుంచి ఓట్లు క్రాస్ కావడం వలనే బిజెపి లావు పడిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి భారీ విజయాన్ని అందించిన ఓటర్లకు ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. మరో కాంగ్రెస్ నాయకుడు మువ్వా విజయ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ తెలుగుదేశం జనసేన పార్టీలో నాయకులు అభిమానులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

## తల్లాడలో విజయోత్సవ సంబరాలు



**ప్రజాపక్షం/తల్లాడ:** ఖమ్మం కాంగ్రెస్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేసిన రామసాయం రఘురాంరెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం పట్ల తల్లాడలో కాంగ్రెస్ నాయకుడు రాయల రాము ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాయల రాము మాట్లాడుతూ ఎమెల్యే మట్టా రాగమయి, దయనంద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వేయడం జరిగింది. కౌంటింగ్ ప్రారంభం నుండి రఘురామిరెడ్డి ఆధిక్యంలో దూసుకుపోవడం జరిగిందని రఘురామిరెడ్డి ఆధిక్యంలో దూసుకుపోవడం జరిగిందని రఘురామిరెడ్డి విజయానికి కృషి చేసిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీదే విజయం అనే విధంగా అందరు కష్టపడి పనిచేసి ముందుకు పోవాలన్నారు. అనంతరం విజయం సాధించిన రఘురాంరెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల విజయోత్సవ సంబరాలు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అభ్యర్థుల విజయోత్సవ సంబరాలు ఏన్కూరు మండలంలో మంగళవారం తెలుగుదేశం, జనసేన, బిజెపి అభ్యర్థులు అందరూ కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి కూటమి పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని జెండాలు కట్టుకొని బైక్ ర్యాలీలతో నినాదాలు చేస్తూ ప్రధాన సెంటర్‌కు చేరుకున్నారు. ఏన్కూరులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రధాన సెంటర్‌లో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. జై చంద్రబాబు, జై బిజెపి, జై జనసేన అంటూ నినాదాలు చేశారు. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొవ్వూరి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కొనకంచి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షులు బొగ్గారపు శివకృష్ణ, ఓటమి నాయకులు ఎంపిపి ఆర్ఎం.వరలక్ష్మి, మాజీ జెడ్పిటిసి కోపెల శ్యామల, తోట గిరిజ, ఆరం రామయ్య, తాళ్లూరి అప్పారావు, జాగర్లమూడి సురేష్, వేముల రమేష్, కోపెల రామారావు, జాస్తి జనార్ధన్, సాయిలు నాగయ్య, పాశం భరత్, గిద్దగిరి విజయ్, ఇల్లూరి సురేష్, పసుపులేటి కృష్ణ, వడ్డే రాజారా, కొవ్వూరి మహేష్, కొవ్వూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌గా మారిన పాత బస్టాండ్..!

**-ఇబ్బందులు పడుతున్న సమీప గృహస్తులు**
**-కంపు కొడుతున్న దుర్వాసన**
**-పట్టించుకోని పంచాయతీ, ఆర్అండ్‌బి అధికారులు**





**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని పాత బస్టాండ్ ఆవరణ డంపింగ్ యార్డ్ గా మారి దుర్వాసన, కంపు కొడుతూ దోమలు స్వైర విహారం తో సమీప ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా కొందరు వ్యాపారస్తులు కొబ్బరి బోండాలు, తాటి ముంజలు తదితర వ్యర్థాలను ఈ స్థలాన్ని అడ్డాగా మార్చుకొని పారేస్తున్నారు. దీంతో సమీపంలోని ఉన్న డబల్ బెడ్ రూమ్ తో పాటు చుట్టుపక్కల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆవరణలో పందులు స్వైర విహారం, ఈగలు, దోమలు దుర్వాసనతో నాన ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చటనే ఖమ్మం, సత్తుపల్లి వైపు వెళ్లాలంటే బస్సు ప్రయాణికులు రోడ్డు వెంట ఎక్కి దిగి పోవాలంటే ఈ స్థలాన్ని షెల్టర్ గా వాడుకుంటున్నారు. కనీసం ఐదు నిమిషాలు నిలబడి బస్సు కోసం వేచి చూడాలంటే కంపు కొడుతుంది. ప్రధాన కారణం చిరు వ్యాపారులు వ్యాపారం చేసే వారు వ్యర్థాలను చెడిపోయిన కూరగాయలను తీసుకొని వచ్చి ఇదే స్థలంలో వదిలి వెళ్తున్నారు. దీనివల్ల ప్రజలు రాకపోకలు చేస్తున్న ప్రయాణికులు దుర్వాసనకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్థలంలో గత సంవత్సరం క్రితం ఆర్ అండ్ బి స్థలం వారికి అప్పగించగా దీనిపై ఆర్ అండ్ బి శాఖ వారు ఎలాంటి జాగ్రత్తలు పట్టించుకున్నట్లు ఏమి కనబడటం లేదు. దీంతో చిరు వ్యాపారులు చేపలు, మాంసం, దుకాణదారులు అడ్డాగా మార్చుకొని కంపు చేస్తున్నారు. అదేవిధంగా మద్యం ప్రియులకు అడ్డాగా మార్చుకొని బహిరంగంగా సేవిస్తున్నారు. విలువైన స్థలాన్ని ఆర్ అండ్ బి శాఖ వారు కాపాడుకో లేకుండా వదిలిపెట్టడం వలన దానిని కొందరు డంపింగ్ యార్డుగా మార్చుకోవడం వలన కంపు కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉన్నారు. సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చేవారు పోయేవారు డబల్ బెడ్ రూమ్ లో ఆవాసం ఉంటున్న ప్రజలు, బస్సు ఎక్కేవారు దిగేవారు ప్రయాణికులు, ఈ కంపు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉంది. ముందుగానే డంపింగ్ యార్డ్ గా మారుతున్న ఈ విలువైన స్థలాన్ని మేజర్ పంచాయతీ అధికారులు ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు, డబల్ బెడ్ రూమ్ వాసులు ఆయా శాఖల వారిని కోరుతున్నారు.

# పొత్తు ధర్మాన్ని పాటించిన కమ్యూనిస్టులు

**- వామపక్షాలతోనే రఘురాంరెడ్డికి అత్యధిక మెజార్టీ**

**ప్రజాపక్షం/ బోనకల్ :** వామపక్షాలు పొత్తు ధర్మాన్ని పాటించారని, అందుకే మండలంలో పదివేల ఓట్ల మెజార్టీ సిపిఐ, సిపిఎం బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి వచ్చిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు అన్నారు. మంగళవారం బోనకల్ మండలంలో ఫలితాల అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రఘురాంరెడ్డి విజయాన్ని గతంలోనే చెప్పామన్నారు. మండలంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న సిపిఐతో పాటు మద్దతు ఇచ్చిన సిపిఎం కార్యకర్తలు, సానుభూతిపరులు పొత్తు ధర్మాన్ని పాటించారన్నారు. అసెంబ్లీ ఎన్నికతో పోలిస్తే బోనకల్ మండలంలో కూటమి అభ్యర్థికి మంచి మెజార్టీ వచ్చిందని ఆయన కొనియాడారు. క్రింది స్థాయి కార్యకర్తల కృషి వలనే ఇది జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో పదికిపైగా సీట్లు గెలవాల్సి ఉందని, కాని దురదృష్టవశాస్తూ రెండు సీట్లు కోల్పోవడం బాధాకరమన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై సిపిఐ పోరాడుతుందన్నారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఐ పార్టీ కాంగ్రెస్ పార్టీ గెలుపుకు చేసిన కృషికిగాను స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీకి మరింత చేయూతనివ్వాల్సిన ఆవశ్యకత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. ఈసమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, మండల సహాయ కార్యదర్శులు జక్కుల రామారావు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** రైతులు విత్తనాలు ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా నాయకులు తాళ్లూరు పాపారావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్‌లో ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో తాళ్లూరి మాట్లాడుతూ రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, వాటికి సంబంధించిన రశీదులను తీసుకొని తప్పకుండా పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, ఎంపీపీ భూక్య పద్మావతి, సంయుక్త కార్యదర్శి కుమారి హనుమంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, మండల సహాయ కార్యదర్శి వేల్పుల భాస్కర్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, సిపిఐ మండల నాయకులు బొడ్డు కేశవరావు, దండు నాగేశ్వరరావు, బండి రమేష్, గడ్డం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో విజయోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/వైరా:** ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి విజయం సాధించడం పట్ల వైరా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గ ఇంచార్జి చెరుకూరి చలపతి విజయోత్సవ ర్యాలీని పార్టీ కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. తెదేపా నాయకులతో పాటు బిజెపి జనసేన కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. భారీగా మోటార్ సైకిల్‌తో ర్యాలీని నిర్వహించి స్థానిక రింగు రోడ్డు వద్ద బాంబులు పేల్చారు. ఈ సందర్భంగా చెరుకూరి చలపతిరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నాల్గోసారిగా ముఖ్యమంత్రి చేపడుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్నామని, అదేవిధంగా కూటమి పార్టీలకు అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో ఎన్‌డిఏ ఆధ్వర్యంలో తెలుగుదేశం బిజెపి, జనసేన మరింత ముందుకు పోవడం జరుగుతుందని, ఖమ్మం జిల్లాలో తెలుగుదేశానికి పూర్వ వైభవం రాబోతుందని చెరుకూరి చలపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా, బిజెపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమష్టి ఉద్యమాలతోనే మహిళలకు రక్షణ

**-మహిళా చట్టాల అమలులో పాలకులు విఫలం**
**-మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి**
**-కొత్తగూడెంలో ఘనంగా మహిళా సమాఖ్య ఆవిర్భావ వేడుకలు**





**ప్రజాపక్షం/కొత్తగూడెం :** సమష్టి ఉద్యమాలతోనే మహిళలకు, మహిళా చట్టాలు, హక్కులకు పరిరక్షణ అని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి అన్నారు. సిపిఐ అనుబంధ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 70బల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఉత్సవాలు జరిపారు. తొలుత సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సులో లక్ష్మి కుమారి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మొట్టమొదటిగా పురుడుపోసుకున్న మహిళా సమాఖ్య నాటి నుంచి నేటి వరకు అలుపెరగని పోరాడం చేస్తోందన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన చరిత్ర ఉందని, మహిళలాకు ఎక్కడ అన్యాయం జరిగినా స్పందిస్తూ న్యాయం జరిగే వారు బాధిత మహిళలకు అండగా నిలుస్తోందన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అసమానతలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమయ్యాయన్నారు. రోజురోజుకు మహిళలపూ దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా వీటిని అరికట్టేందుకు ఉన్న చట్టాలను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. బ్రూణ హత్యలు, ఆడపిల్లల అమ్మకాలు, హింస, వివక్షత వంటి దుశ్చర్యలను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజంలోస్త్రీకి సంపూర్ణ గౌరవం దక్కినపుడు, చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని లేనిపక్షంలో మహిళల ఆగ్రహాన్ని చవిచూడకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకురాల్ళు మామిడాల ధనలక్ష్మి, కరిష రత్నకుమారి, మంద నిర్మల, మేదిని లక్ష్మి, దార్ల లక్ష్మి, ఎస్‌కె.షాహీన్, పుట్టి భాగ్యలక్ష్మి, ఎం.అనసూర్య, ఎం.విజయలక్ష్మి, ఎస్‌కె.షమీమ్, కె.నాగమణి, బి.శాంతి, ప్రమీళ, సమ్మక్క, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# సంబరాలు జరుపుకున్న టిడిపి, జనసేన శ్రేణులు



**ప్రజాపక్షం/పినపాక:** ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ విజయం దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో పినపాక మండల వ్యాప్తంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పినపాక టిడిపి మండల అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి ధర్మరాజుల శంకర్‌లు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పూరించిన శంఖారావం విజయం సాధించిందని, శపథం నెరవేరిందని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని స్థానిక ఎన్నికల్లో టిడిపి పోటీలో ఉంటుందని, స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన సత్తా చాటుతామని టిడిపి, జనసేన నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. టపాసులు పేల్చుకొని సంబరాలు నిర్వహిస్తున్నారు. చింతల బయ్యారం, జానంపేటలో సంబరాల్లో భాగంగా కేక్‌లు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కంటిపూడి వెంకన్న బాబు, తోట ప్రశాంత్, తోట రవి, గగ్గూరి కన్నయ్య, కురికూరి శ్రీనివాస్, పొనగంటి హరికృష్ణ, తోట రాజు (దోని) గగ్గూరి, నాగరాజు, పడిగల తరుణ్, కప్ప కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై పోలీస్‌ల ఉక్కుపాదం



**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల మండల కేంద్రంలోని కలవాల నాగారం శివారులో గల కౌలూరు గ్రామ అటవీ ప్రాంతంలో కరకగూడెం ఎస్ఐ రాజేందర్ తన సిబ్బందితో కలసి తనిఖీలు నిర్వహించగా గుడుంబా తయారీ కోసం ప్లాస్టిక్ డ్రమ్ములలో నానపెట్టిన సూమరు 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో ఏ గ్రామంలో అయినా గుడుంబా తయారీ గాని, అమ్మకంగానే జరిపితే, ప్రజలు నేరుగా తనకు సమాచారం తెలపాలని సూచించారు. గుడుంబా తాగి చాలా కుటుంబాలు చిన్నాభిన్నంగా మారుతున్నాయని అన్నారు. కరకగూడెం మండలాన్ని గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలిస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంబరాలు జరుపుకున్న కూటమి అభ్యర్థులు





**ప్రజాపక్షం/దమ్మపేట:** ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల ఫలితాలలో కూటమి పార్టీ అఖండ మెజార్టీతో విజయం సాధించటం పట్ల రాష్ట్ర సరిహద్దు మండలం అయిన దమ్మపేట మండల వ్యాప్తంగా పవన్ కళ్యాణ్ అభిమానులు మరియు టిడిపి పార్టీ అభిమానులు జరుపుకున్న సంబరాలు అంబరాన్నంటాయి. తమ అభిమాని పవన్ కళ్యాణ్ అఖండ మెజారిటీతో పిఠాపురంలో విజయం సాధించడం పట్ల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ వీరాభిమానులు మండలం నుంచి పలువురు పిఠాపురం తరలి వెళ్లారు. మంగళవారం రోజు పూర్తిగా మండల వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. ఒక పక్కన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురామ రామ సహాయం అఖండ మెజారిటీతో విజయం సాధించటంతో ఒక పక్కన కాంగ్రెస్ కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తపరుస్తుంటే మరో పక్కన టిడిపి నాయకులు, జనసేన నాయకులు కలిసి ఊరంతా ద్విచక్ర వాహనాల మీద తిరుగుతూ తమ నాయకుడి మీద, తమ యొక్క పార్టీ మీద తమకు ఉన్నటువంటి అభిమానాన్ని ర్యాలీలు నిర్వహించి, టపాసులు కాల్చి ఆనందాన్ని వ్యక్తపరుస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. దీంతో మండల వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది.

## టిడిపి శ్రేణుల సంబరాలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలలో తెలుగు దేశం పార్టీ గెలుపొందిన సందర్భంగా కరకగూడెం మండల కేంద్రంలో మంగళవారం టిడిపి శ్రేణులు, అభిమానులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరకగూడం మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సిరిశెట్టి కమలాకర్, రాష్ట్ర నాయకులు చందా మధు, పాయం లక్ష్మి నారాయణ, చందా రాఘవులు, పార్లమెంట్ ఎస్టీ సెల్ నాయకులు వీసం సత్యనారాయణ, మండల నాయకులు అవుదొడ్డి శ్రీను, ముత్తంశెట్టి సత్యనారాయణ, రాజేష్, కళ్యాణ్, సాయితేజ, శ్రీకృష్ణ, దేగల పల్లవి తదితరులు పాల్గొన్నారు

## చేగువేరా యూత్ ఆధ్వర్యంలో సంబరాలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** చేగువేరా యూత్ ఆధ్వర్యంలో పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ గెలుపును కాంక్షిస్తూ కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో బాణసంచా కాల్చి స్వీట్లు పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ సంబరాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేగువేరా యూత్ అధ్యక్షులు గంగరబోయిన మురళి, కేసగాని ప్రసాద్‌రాజు, గడ్డం దిలీప్, సన్నీ, జాని, ఆది అచ్యుత్, అనిల్, కృష్ణ, ప్రభాకర్,కోటి, మహబూబ్, రాజు, సంపత్, వెంకటేష్, పుల్లయ్య, మల్లేష్, హరి, సతీష్, బిక్షపతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు అధైర్యపడకండి

**ప్రజాపక్షం/కారేపల్లి:** బిఆర్ఎస్ పార్టీ మాజీ దిశా కమిటీ మెంబర్ లకావత్ లక్ష్మణ్ మాట్లాడుతూ మంగళవారం వెలువడిన ఫలితాలు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు కొంత నిరాశ పరిచింది. బిఆర్ఎస్ పార్టీ ఎన్నో ఒడిదొడుగులను చూసింది. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది ఉన్న వాళ్ళను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని, అదేవిధంగా వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తామని చెప్పడం జరిగింది. వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బానోతు మదన్‌లాల్ నాయకత్వంలో సింగరేణి మండలంలో పార్టీని అభివృద్ధి పథంలో నడిపి త్వరలోనే స్థానిక ఎలక్షన్‌లలో అన్ని గ్రామ పంచాయతీలు ఎంపిటిసిలు, జెడ్పిటిసి గెలుస్తున్నామని అందరూ ధైర్యంగా ఉండాలని సూచించడం జరిగింది.

## వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి..




**ప్రజాపక్షం/పినపాక:** పీఏసీఎస్ పినపాక సహకారం సంఘంలో మండల రైతులకు కావలసిన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పినపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డాక్టర్ రవి శేఖర్ వర్మ తెలిపారు. మంగళవారం ఆయన పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గల సహకార సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ బీపీటీ (5204), 25 కేజీల బ్యాగ్ 1033 రూపాయలు, ఏంటీయూ (1061), 30 కేజీల బ్యాగ్ 1185 రూపాయలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు సంఘం నందు కావాల్సిన విత్తనాలు తీసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కార్యాలయం లో గానీ లేదా 9948212483 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

## టిడిపి విజయోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** దేశవ్యాప్తంగా మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి పార్టీ భారీ విజయాన్ని సాధించడంతో జగన్నాధపురంలో టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా జగన్నాధపురం నందు బాణాసంచా కాల్చి, టిడిపి శ్రేణులు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పట్టిన శని వెలువడిన ఫలితాలతో వదిలిపోయిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది, అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# బిజెపికి ఇది గుణపాఠం

**-తెలంగాణలో బిజెపి ఫలితాలు ప్రమాదకరం**
**-సిపిఐ నేత బాగం హేమంతరావు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు బిజెపి నేతల అహంకారానికి, చేతలకు చెప్పిన గుణపాఠమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం హేమంతరావు మాట్లాడుతూ బిజెపి 400 సీట్లను కోరి ఈ దేశ రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టాలని కుట్రలు చేసిందని అందుకే పరిపాలనకు సరిపడ మెజార్టీ కోరకుండా 400 సీట్లు కోరిందని ప్రజలు ఇది గ్రహించి సరైన రీతిలో వ్యవహరించారన్నారు. సిబిఐ, ఈడి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను, విపక్షాలను దెబ్బతీసేందుకు ప్రయోగించారని దీనిపై సైతం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. కాని ఇప్పటికైనా బిజెపి తన పద్ధతిని మార్చుకుంటే మంచిదన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఫలితంగా బిజెపి ప్రమాదకర శక్తిగా మారిందన్నారు.పలు చోట్ల బిఆర్ఎస్ బిజెపికి తన ఓట్లను మళ్లించడం వల్లే ఈ స్థాయిలో బిజెపి గెలిచిందని ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. ప్రమాదకర బిజెపిని నిలువరించేందుకు కాంగ్రెస్, వామపక్షాలు మరింతగా కలిసి పనిచేయాలని హేమంతరావు సూచించారు.

# ఖమ్మం పార్లమెంటు ఓటర్లకు కృతజ్ఞతలు

**సమస్యల పరిష్కారానికి కృషి : పోటు ప్రసాద్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు పరిధిలో వామపక్షాలు బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి రికార్డు మెజార్టీ ఇచ్చిన ఖమ్మం ఓటర్లకు భారత కమ్యూనిస్టు పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనపై ప్రజలు ఇచ్చిన తీర్పుగా ఆయన అభివర్ణించారు. కేంద్రంలో బిజెపి విషయంలో బిఆర్ఎస్ ఆడిన దోబుచులాట ఈ ఘోర ఓటమికి కారణంగా సిపిఐ భావిస్తుందన్నారు. వామపక్షాలు కాంగ్రెస్ కూటమిని ప్రజలు పూర్తి స్థాయిలో స్వాగతించారని ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రసాద్ తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పటిలాగే ముందు వరుసలో నిలుస్తుందని, సహకరించిన ప్రతి ఒక్కరికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

## ఘన విజాయన్ని అందించిన జిల్లా ప్రజలకు అభినందనలు

**జిల్లా అభివృద్ధికి నూతన ప్రజాప్రతినిధులు కృషి చేయాలి**



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** భద్రాద్రి జిల్లా పరిధిలోని ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరాం నాయకులకు ఘన విజాయన్ని అందించిన భద్రాద్రి జిల్లా ప్రజలకు, వీరి గెలుపు కోసం కృషి చేసిన మిత్రపక్షాల నాయకులకు, కార్యకర్తలకు సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా అభినందనలు తెలిపారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు స్థానాల్లో సిపిఐ మద్దతుతో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థల గెలుపు ఊహించేందే అయినప్పటికి కేంద్రంలో ఇండియా కూటమికి అధికారం దక్కకపోవడం బాధాకరమన్నారు. దేశంలో ప్రమాద గంటికలు మ్రోగాయని, ప్రజాస్వామ్యానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరింత పెనుముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడబోతున్నాయని, ఈ పరిస్థితులను ఎదుర్కొని దేశాన్ని కాపాడుకునేందుకు కమ్యూనిస్టు పార్టీ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. నూతనంగా ఎంపిలుగా గెలుపొందిన వారు జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలని, చట్టసభల్లో జిల్లా ప్రజల గొంతుక వినిపించాలని కోరారు.

## పవన్‌కళ్యాణ్ గెలుపు పట్ల సంబరాలు



**ప్రజాపక్షం/వైరా:** జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పిఠాపురంతో పాటు జనసేన అభ్యర్థులు గెలవడాన్ని కాంక్షిస్తూ వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రేచర్ల బజార్‌లో శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ ఫొటో వద్ద కేక్ కట్ చేసి బాంబులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పవన్‌కళ్యాణ్ అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

# బలరాం నాయక్ భారీ విజయం

**- కాంగ్రెస్ శ్రేణుల్లో సంబురాలు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ 340159 ఓట్ల భారీ మెజార్టీ సాధించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎంఎల్ఏలు కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో ఆయన గెలుపు మరింత సునాయాసంగా మారింది. గత నెల 13వ తేదిన పార్లమెంట్ ఎన్నికల జరగగా మంగళవారం ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సాగింది. మొదటి రౌండ్ నుండి బలరాం నాయక్ ఆధిఖ్యతను కొనసాగిస్తూ వచ్చారు. లెక్కింపు సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో గల జిల్లాలోని నియోజకవర్గాలైన భద్రాచలం,పినపాక, ఇల్లెందు ఎంఎల్‌ఏలు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్యతో పాటు ఆయా నియోజకవర్గాల ముఖ్యకార్యకర్తలు మహబూబాబాద్‌కు చేరుకుని బలరాం నాయక్‌తోనే ఉన్నారు. బలరాం నాయక్ ప్రతీ రౌడ్‌లోనూ స్పష్టమైన ఆదిఖ్యతను కొనసాగిస్తుండటంతో తొలిరౌండ్ నుండి గెలుపుపై ఆశలు పెరిగాయి. గెలుపు తనవైపు పూర్తి స్థాయిలో మొగ్గుచూపగానే కౌటింగ్ సెంటర్‌ను బయటకు వచ్చిన ఆయన తన శ్రేణులతో కలిసి విజయచిహ్నాని చూపిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఇంతటి విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకుల సమిష్టి కృషితోనే ఇంతటి విజయం కైవసం అయ్యిందని, పార్లమెంట్ పరిధిలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

**కాంగ్రెస్ శ్రేణుల్లో సంబురాలు...**

బలరాం నాయక్ గెలుపుతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత జోష్ నిండుకుంది. పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల కేంద్రాలతో పాటు ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండాలు రెపరెపవాడుతున్నాయి, నాయకులు, కార్యకర్తలు మోటరా సైకిళ్లకు కాంగ్రెస్ జెండాలుకట్టుకుని ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

# ఇది ప్రజా గెలుపు

**-అత్యధిక మెజార్టీని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు**
**-ప్రజల వాణిని రఘురాంరెడ్డి ఢిల్లీలో వినిపిస్తారు..**
**-మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు ప్రజల విజయమని ఖమ్మం కాంగ్రెస్ కంచుకోట అని మరోసారి ప్రజలు నిరూపించారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రఘురాం రెడ్డి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఎవరు ఊహించని మెజార్టీని అందించిన ఖమ్మం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో చరిత్ర సృష్టించాలన్న దానిని తిరగరాయాలన్న కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఖమ్మం లోక్‌సభ చరిత్రలో ఇప్పటి వరకు ఎవరికి రాని మెజార్టీని రామసహాయం రఘురాంరెడ్డికి అందించడం కాంగ్రెస్ పార్టీకి గర్వకారణమన్నారు. 4,67, 847 ఓట్ల మెజార్టీని కట్టబెట్టారని మంత్రి పొంగులేటి తెలిపారు. చారిత్రక గెలుపులో భాగస్వాములైన కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రలజ పక్షాన ఢిల్లీలో రామసహాయం రఘురాంరెడ్డి తన వాణిని వినిపిస్తారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు.

## టిడిపి విజయోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** దేశవ్యాప్తంగా మంగళవారం వెలువడిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి పార్టీ భారీ విజయాన్ని సాధించడంతో టిడిపి జిల్లా నాయకులు గుంటూపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా సారపాక ప్రధాన సెంటర్ నందు బాణా సంచా కాల్చి, టిడిపి, జనసేన శ్రేణులు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పట్టిన శని వెలువడిన ఫలితాలతో వదిలిపోయిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్ది, అన్ని వర్గాల ప్రజలకు సుపరిపాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో రెజొనెన్స్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ 2024 ఫలితాల్లో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి తమ ఆధిక్యాన్ని చాటుకున్నారని రెజొనెన్స్ విద్యా సంస్థల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు లు తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాలలో జి. చంద్రికా లక్ష్మి 559, వి. జోషిక 521, జి. మమత 518, ఎ. సాయి దర్శన 483, తనుష్ 468, తను 463, ఆర్. జాహ్నవి 452 వంటి అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి ఘన విజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, బోధనానుభవం కలిగిన మేనేజ్‌మెంట్ ఈ విజయానికి కారణమన్నారు. ఇంటర్‌తో పాటే నీట్, ఎంసెట్ వంటి జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు తగు శిక్షణనివ్వడం వలన ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు నాంగేంద్రకుమార్, శ్రీధర్‌రావు, ప్రిన్సిపల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, శాంతి, అధ్యాపకులు అభినందించారు.

# పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ దృశ్యమాలిక






















